# ఓంకారము

వేదమందలి ఋగ్యజుస్సుల పఠనము ఓంకారోచ్చరణము తోడ నారంభించుట సంప్రదాయము. ఓం అనగా, సమ్మతిః అంగీకృతిః అభిమతముః ఇచ్చగించుట.

ఓం నమో భగవతే రుద్రాయ – నాకు ఇష్టమై, సమ్మతితోడ, భగవంతుడైన రుద్రునికి నమస్కరించుచున్నానని భావము. కాని ఈ రుద్రుడెవరు? రుద్రుడు భగవంతుడా? అసలు రుద్రుడుండెనా? ఉన్నను, భగవంతుడైనను, నమస్కరించుటకు నాకేమి యవసరము? భగవంతుడను మాటకు యర్థమేమి? ఇది ఏమియు మనకు తెలియకపోయినను, తెలియజెప్పకుండగనే, ప్రథమమున అంగీకారసూచకమైన ఓంకారముతోడ మంత్ర మారంభమయినది. వేదమన్త్రార్థము తెలియకుండ, నేనా మంత్రార్థ మంగీకరించుచుంటినని ముందుగా వాక్రుచ్చుట భావ్యమా? న్యాయమా?

ఆలోచించినచో, దైనందిన జీవితములో, అనేక విషయములందు, విషయవిమర్శకు పూర్వమే, మనము పనుల నారంభించుచున్నాము. అనగా మనసా ఆ పని సేయుట నంగీకరించుచున్నాము. క్రొత్తయూరికి పోయినాము. తెలియని చాకలికి బట్టలు శుభ్రముసేయుటకిచ్చుచున్నాము. వారము దాటగనే తెచ్చునని నమ్మిక. తేనిచో!మరల కన పడక పోయినచో! అందుకని మానుచుంటిమా? లేదు. నెలకు పూర్వమే ప్రయాణమునకు విమానపు టిక్కెట్టు కొంటిమి. ఈ నెల రోజులలో మనకే అడ్డంకి రాదనియు, ప్రయాణమునకెట్టి భంగమును కలుగదనియు, మనస్సు భావించినది. చెడిపోవచ్చునను భావమునకు కాక, అంతయు సవ్యముగ జరుగునను భావమునకు, మనస్సు ప్రాధాన్యత నిచ్చుచున్నది.

ఆరోగ్యమునందు ఒడుదొడుకులు కలిగినను, మానవుడు శతాయువనిన భావముతోడనే బ్రతుకును. జీవితము నందు, భావికాలము సర్వము ఫలించుననిన యాశ తోడనే అన్ని పనులు సేయును. జీవయాత్రలోని ప్రతి కార్యము మనమూహించినటుల రూపొందునని యారంభించుచుంటిమి గదా! ఈ ఆశను, ఈ నమ్మకమును, ఈ ఒప్పుదలను, ఈ సమ్మతిని వేదము ఓంకారమనుచున్నది. ఇట్టి సమిష్టి భావమునకు వాగ్రూపమోంకారము.

వేదమీ విశ్వగత సకల ప్రాణి సంతాన జీవన విధాన యదార్థ వ్యాఖ్యాన శాస్త్రగ్రంథమగుటజేసి, అందలి మంత్ర ములన్నియు ఓంకారోచ్చరణారంభములు.

నేను దైనందిన జీవితమునందు సేయు పనులలో నాకు సంపూర్ణమైన జ్ఞానము లేకున్ననూ, నా యత్నము ఫల వంతమగునను ఆశ తోడ సేయుచున్నాను. అటులనే, రుద్ర, భగవశ్శబ్దములకు సంపూర్ణమైన అర్థము తెలియకపోయిన ను, మీ శక్తి స్వరూపవిభవములు సకలమవగాహనము కాక పోయినను, నా నమస్కారము ఫలవంతమగునను విశ్వాసము తోడ నమస్కరించుచున్నానని ఆ వేదమన్త్ర వాక్య భావము.

**ఓం! నమో భగవతే రుద్రాయ!**

ఆధిభౌతికార్థమయినది. ఇక నాధ్యాత్మిక లోకగతార్థమును విచారింతము. ఓంకారము ప్రారంభార్థకము కూడ. ఓంకారోచ్చరణముతోడ, నేను ప్రారంభింపబోవుచున్నానని చెప్పుచున్నాము. ఎవరికి చెప్పుచున్నాము? మనకు మనమే చెప్పుకొనుచున్నాము. అనగా మన మనస్సునకు ఎందుకు చెప్పవలెను? వేద మంత్రోచ్చారణ అల్పమయిన పని కాదు. మహత్త్వముతో కూడిన పని. మూడు దేహములకు శ్రేయస్సు నొనగూర్చుపని. దానివలన లాభము పొంద వలెనని చేయుచున్నాము. ఆ లాభము, ఆ శ్రేయస్సును పొందుటకు ఆ మంత్రములను అక్షరపదభ్రష్టము గాకుండ, ప్రత్యక్షరమును, నిర్ణయింపబడిన మాత్రలను తగ్గించకుండ, హెచ్చింపకుండ, ఉచ్చరింపవలెను. దానివలన కలిగెడు మేలు అనంతమని వేదము చెప్పుచున్నది. ఆ మంత్రపఠన వేళల అందలి మహార్థములను భావన సేయవలెను. వాని యర్థములు అవగాహన మయినకొలది, హృదయమునందు ఓర్పు, శాంతి, సర్వప్రాణులందును సమానభావము ఉద్భవించి, క్రమముగా వర్ధిల్లునని చెప్పుచున్నది. ఆ మహామంత్రార్థముల ననుసరించినచో జీవితము వ్యర్థమయినదనిన భావమును రానీయదనుచున్నది. ఆనందము, అనగా జీవనమునందు తృప్తిభావము ఆవిర్భవించుననుచున్నది. అట్టి మహామంత్రపఠనమారంభింప బోవుచున్నాను. ఓ మనస్సా! అట్టి సమయమున, నీవు అటునిటు గంతులు వేయక, ఏకైక ధ్యానముతోడ నుండుమని చెప్పుటకు.

ఆ మనస్సునకు మనమాట వినుటకు, పూర్వవ్యాపారమునుండి వెనుకకు వచ్చుటకు, కొంత వ్యవధి పట్టును గదా! అందు వలననే ప్రణవోచ్చారణము నందు మూడు మాత్రలు. ఒక హ్రస్వాక్షరముచ్చరించు కాలమొకమాత్ర. దీర్ఘాక్షరోచ్చరణ కాలము రెండు మాత్రలు. మూడు హ్రస్వాక్షరములుచ్చరించుటకు పట్టు కాలము ప్లుతము. దీనిని చెప్పుటకే ఓంకారమును వ్రాయునపుడు ఓకార, మకారముల మధ్య మూడు అంకెను వేయుదురు (ఓ3మ్). మనస్సు పూర్వముండిన ఊహలను వదలి, మంత్రోచ్చారణ, మంత్రార్థములయందు నిలచుటకు వలసినంత కాలమిచ్చుటకొరకు వేదము ఓంకారమును ప్లుతము జేసినది.

అగ్నిమ్ ఈళే పురోహితమ్ అని ఋగ్వేద ప్రథమ ఋక్కు. అగ్ని యనగా పృథివ్యాప్తేజో వాయురాకాశ వృతమయిన బ్రహ్మాండమండలమున (universe) సర్వాంతర్యామియైన మహాచైతన్యరూపము (moving force) పురోహితమనగా, ఈ క్షణము దాటిన క్షణమునుండి (భావికాలమునందు) హితము గూర్చునది. మంగళ ప్రదమయినది. ఈళ యనగా స్తుతి. ఆ మహాగ్నిని నుతించుచు, నుతింపవలయు ననుచు వేదమవతరించినది.

ఆ మహాగ్ని ధ్యానమతియై, వేదపఠనమారంభింపవలయును. మనస్సునకు కావలసిన వ్యవధినిచ్చుటకొరకే ఈ ప్రథమ వాక్యపఠనము ప్లుతమైన ఓంకారము తోడ నారంభింపవలెనని వేదాంగమైన వ్యాకరణ శాస్త్రాదేశము.

## ఓ 3 మ్, అగ్నిమీళే పురోహితమ్

ఆధిజ్యోతిషపరముగా ఓంకారమునకు పరబ్రహ్మమని యర్థము. పరబ్రహ్మమనగా ఈ అనంతమైన విశ్వమున ందున్న యన్ని పదార్థములు, అన్ని శక్తులు, అన్ని పరిమిత జ్ఞానములు పుట్టుటకు, వ్యవహరించుటకు, అదృశ్య మగుటకు, కారణమైన చైతన్యము. ఏ శక్తివలన పరమాణువులు (quarks) పదార్థము (matter) నిష్పదార్థము (anti –matter), క్వాసారు (quasars) నక్షత్రములు (stars) తేజోగోళములు (galaxies) ప్రాణము (life) ప్రాణులు (living beings) కళలు (arts) శాస్త్రములు (sciences) పుట్టి, బ్రతికి నశించుచున్నవో, ఆ సర్వాంతర్యామియైన శక్తి. ఆ శక్తికి ఓంకారమని పేరు. ఆ ఓంకారనామ పరబ్రహ్మకల్పిత బ్రహ్మాండమునందు మనమొక సూక్ష్మాతి సూక్ష్మ భాగము. ప్రథమమున ఆ చైతన్యస్వరూపమును స్మరించి, తరువాత మన సూక్ష్మ భాగాధికారియైన దైవ భాగమును ప్రార్థింపవలెనని వేదనియమము. నిత్యమా యనంతచైతన్య స్వరూప భావనలేక, మనదైన దైవభాగమును మాత్రము స్మరించినచో, దానికి మాత్రమే ప్రాధాన్యత నిచ్చినచో, యథార్థస్థితికి దూరమై, సంకుచిత దైవభావమేర్పడును.

సంకుచితమనగా పరిమితము. తనదైవమే దైవము. ఇతర దైవములు దైవములు కాదనిన భావన. అందరి దైవ ముల సమిష్టి స్వరూపమా పరబ్రహ్మమనిన భావన లేకపోవుట. వేదమా పరబ్రహ్మస్వరూపమను భగవత్తర రూపమను చున్నది. ఆ భగవత్తర విరాడ్రూప, భాగములైన దైవశక్తులకు భగవంతుడని పేరు.

ఈ ఓంకార భావనాశూన్యమైన పరిమిత దైవభావనల వలన మానవచరిత్రలో జరిగిన, జరుగుచున్న ఉపద్రవ ములను మనమందరమెరుగుదుము. తమదైవమొక్కడే దైవమనిన భావము వలననే గదా, యూరప్‌లో మత దండ యాత్రల (crusades) పేరుతో జరిగిన యుద్ధములు! మొగలులు భారత దేశమును పాలించు కాలమున అనేకమంది ఔరంగజేబులు ఉద్భవించుటకు ఈ భావనయే కారణము గదా!

పూర్వాంధ్రరాజులలో కాకతీయ రాజ్యాధిపతి అయిన మొదటి ప్రతాపరుద్రుడు వీరశైవుడు. ఆయన తండ్రి ప్రోల రాజు. వీరశైవావేశములో ప్రతాపరుద్రుడు, రుద్రుడై, తండ్రినే వధించెను!

దక్షిణదేశమందున్న శ్రీ రంగములోని రంగనాథస్వామి యాలయము ప్రసిద్ధమైనది గదా! ఆ దేవాలయా ధికారులు, అర్చకులు వైష్ణవులు. వైష్ణవులలో రెండు తెగలున్నవి. ఒకటి తెంగల, రెండవది వడగల. అధికారులు తెంగల వైష్ణవులు అర్చకులు వడగల వైష్ణవులు. తెంగల వైష్ణవులు రామానుజాచార్యుల వారి అనుయాయులు.వడగల వైష్ణవులు తరువాత వచ్చిన దేశికాచార్యులవారిచే ప్రభావితులు. రామానుజాచార్యులవారి మతము (school of thought) నందు నారాయణుడైన విష్ణుమూర్తి ఒక్కడే ప్రధానుడు. లక్ష్మీదేవికి విష్ణుమూర్తి ప్రక్కన సమానమైన పీఠము ఈ క్రొత్తగా వచ్చిన వడగలులు, తెంగలులనుండి వేరని తెలియుటెట్లు? అంతవరకు వైష్ణవులందరు ముఖము నందలి ఊర్ధ్వ పుండ్రమునందు రెండు తెల్ల చారలమధ్య ఎఱ్ఱ చారను ధరించుచున్నారు. కదా! మనము లక్ష్మీదేవికి కూడ ప్రాధాన్యత నిచ్చుచున్నాము. లక్ష్మీదేవికి వారు ధరించు కుంకుమయే కాక,పసుపు కూడ ప్రియమైనది కదా! అందువలన మనము

మధ్యచారను పసుపుతో పెట్టుకొనెదమని నిశ్చయించిరి. అప్పటినుంచి వడగలులు పచ్చ బొట్టు వారైరి. 20 వ శతాబ్ద్యా రంభమునందు శ్రీరంగములో వారికి , వీరికి మధ్య రవరవలు బయలుదేరినవి. రంగనాథస్వామి యాలయమునందు భేదాభిప్రాయములు తీవ్రరూపమును దాల్చినవి. ఆంధ్ర దక్షిణ దేశములలోని అన్ని వైష్ణవదేవాలయములందును జరుపవ లసిన పూజావిధానము, దేవుని అలంకరణ విధాన సంప్రదాయములను ఏర్పరచినదిరామానుజాచార్యుల వారు. అందు వలన మూల విగ్రహములు గాని, ఊరేగింపులందేగు ఉత్సవ విగ్రహాలు గాని ధరించు పట్టె వర్ధనములు ఎఱ్ఱని కుంకుమ తోడనే. ఊరేగింపు అనగా ఒక్క ఉత్సవ విగ్రహములతోడనే కాదుగదా! బాజాలు, పల్లకీలు, దివిటీలు, ఏనుగులు – ఇంకను ఎన్నియో ఉన్నవి. వీటియన్నిటి వివరములు రామానుజాచార్యులు ఏర్పరచిన విధి, నియమములలో లేవు. అనగా ఉత్సవము నందలి తక్కిన వివరములు, అర్చకుల చేతిలో నున్నవి. వారు ఊరేగింపునందు ఎల్గొను ఏనుగునకు ఫాలము నందిడిన తిలకమునందు కుంకుమకు బదులు పసుపువాడి, ఆ భక్త గజేంద్రుని వడగల తెగలోన జేర్చిరి. అధికారులదికూడదనిరి. తగాదా పెరిగి పెద్దదియై కోర్టు జేరినది. బీదవారైనచో, వచ్చిన తగాదాలు ఊరిలోని పంచాయతీదారుల తీర్పుతో తీరిపోవును. కొంచెము ధనవంతులైనచో మునసబు కోర్టు. ఇంకను ధనవంతులైనచో జిల్లా కోర్టును గూడ దాటి, హైకోర్టు వరకును పోవును గదా! ఇది లక్ష్మీపతియైన రంగనాథుని విషయము. కేసు హైకోర్టును దాటి పోవుటలో నాశ్చర్యము లేదు.

శ్రీ రంగమునందు రంగనాథస్వామి శేషతల్పశాయి. ఆయన నిద్రలో నుండును. ఆయన నిద్రకు భంగమని గుడిలో కొబ్బరికాయ కొట్టరు. దూరముగా కొట్టి, కోరిన కొబ్బరి ప్రసాదమిత్తురు. అధికారులు గాని, అర్చకులు గాని రంగశాయి నిద్రలేపుట కిచ్చగించలేదు. స్వామివారి ధనమును, స్వామివారి పనిమీదనే ఖర్చు పెట్టుచుంటిమి; ఆయన తోడ చెప్పవలసిన పనిలేదని నిశ్చయించిరి. ఆ రోజులలో ఇండియాలో సుప్రీంకోర్టు లేదు. మహాన్యాయము చెప్ప వలసినచోటు లండన్‌లో నున్నప్రీవీకౌన్సిలు. ప్రీవీ కౌన్సిలులో ఇండియా దేశీయులకు స్థానము లేదు. వాగ్వాదము సేయు లాయర్లు, జడ్జీలు, అందరును ఆంగ్లేయులే. హిందూదేశములోనున్న దేవాలయములు, ఆ దేశీయుల మతాచార ములు, అన్నియును మూఢ నమ్మకముల మీద నాధారపడియున్నవని నిశ్చితాభిప్రాయులైన ఆ తెల్ల దొరలు, మీరె వరును లండన్ రావలసిన పని లేదు, కాగితముల నాధారముగా మేము న్యాయము చెప్పెదమనిరి. తగాదాకు సంబంధించిన కాగితములు పొగ ఓడనెక్కి, మూడు వారములు ప్రయాణము జేసి లండను మహానగరము జేరినవి.

రెండు పక్షముల తరుపున వాదించిన న్యాయవాదులందరు హేమాహేమీలు. నిమిషమునకు వందల పౌండ్ల చొప్పున ఫీజు. రంగనాథుడు జగన్నాథుడు కనుక తట్టుకొనెనుగాని, సామాన్యులు తట్టుకొనలేరు. చివరకు ప్రీవీ కౌన్సిలు తీర్మానము వచ్చినది. ఏనుగునకు ఎఱ్ఱ బొట్టుపెట్టవలెనని. అధికారులు ఏనుగు నెక్కిరి. ఎటులైనను తెల్లవారైన ఆంగ్లేయులు సాంప్రదాయసిద్ధులు, ఈ మధ్య వచ్చిన పచ్చబొట్టు నెందుకాదరించెదరని సహేతుకముగా సంతసించిరి. అర్చకులు ఆమ్లేచ్ఛులకు మన మతములు, వాటి విశిష్టతలు ఎట్లు తెలియునని గుటకలు మ్రింగిరి. ఈ తగాదాకు సంబంధములేని వైష్ణవులు, ప్రీవీ కౌన్సిలునకు అధ్యక్షత వహించు ప్రధాన న్యాయాధీశుడు, పౌండు నాణెమును పైకెగుర

వేసెననియు, విక్టోరియారాణి బొమ్మ పడినదిగాన, ఎఱ్ఱబొట్టు వైపు తీర్పు నిచ్చెననియు బొరుసు పడినచో పసుపు బొట్టు వారికనువుగా తీర్పు చెప్పి యుండుననియు అనిరి.

వేదఘోషితమైన ఆ బ్రహ్మభావనావగాహనములు లేనివారి మనస్సులు తిన్నని మార్గమునకు దూరమై, ఎట్టి విచిత్ర మార్గముల ననుసరించు నవకాశమున్నదో చూపుటకే ఈ జరిగిన కథ నిచ్చట చెప్పుట.

ఓమితి బ్రహ్మ–ఓంకారమే బ్రహ్మ; ఓమితీదగ్ం సర్వమ్–ఆ బ్రహ్మమయము కానిది సృష్టిలో లేదు. అని యజుర్వేదము ఈ సృష్టి సర్వమా విరాడ్రూపమనియు, ఓంకారమా విరాడ్రూపమునకు పర్యాయ పదమనియు, వేదము మాటికి మాటికి చెప్పుచుండును. అందువలననే, వేదమంత్రములు ఓంకారారంభములు. ఓంకార ప్రభావ ప్రకటనములు.

ఓంకారోచ్చరణము, ఓంకారభావన, ఓంకార స్వరూపావగాహనము, ఆధిభౌతిక, ఆధ్యాత్మిక, ఆధిజ్యోతిష లోకములందు శ్రేయోదాయకములు.

**ఓమితి బ్రహ్మ, ఓమితీదగ్ం సర్వమ్!**